
మాట్లాడుతున్న జంగయ్య

ప్రజాపోరాటానికి మతం రంగు పులమొద్దు

» సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాచరికం రద్దు కోసం జరిగిన ప్రజా పోరాటానికి మతం రంగు పులమొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం చేవెళ్లలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఆనాటి కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలు లేకుండా తెలంగాణ విలీనం జరిగేదా అని ప్రశ్నించారు. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా జరిగినదే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమన్నారు. ఇది హిందువులకు, ముస్లింకు జరిగిన పోరాటం కాదని.. దీనికి మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. ఎంతోమంది ముస్లిం కమ్యూనిస్టు యోధులు నిజాంలకు ఎదురొడ్డి ప్రాణాలు అర్పించారని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదీన సమైక్య దినోత్సవంగా కాకుండా, అధికారికంగా విలీన దినోత్సవం పేరుతో నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఎం.ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణచారి, మగ్బుల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, శ్రీనివాస్, జంగయ్య, నాయకులు సుధాకర్‌గౌడ్, మంజుల, శ్రీశైలం ఉన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులు

రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిజాం సైన్యం అండతో సాగిన అకృత్యాలను ఎదురిస్తూ కొనసాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టులే వారసులని రైతు సంఘం జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి తెలిపారు. షాద్‌నగర్ పెన్షనర్ భవన్‌లో ఆదివారం యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దాడులు, దౌర్జన్యాలను భరించలేక ప్రజలందరూ ఏకమై కమ్యూనిస్టుల నాయకత్వంలో రజాకార్లకు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం రెండు మతాల మధ్య జరిగింది కాదని, దోపిడీదారుల, దోపిడీకి గురైన వారి మధ్య జరిగిన పోరాటమని పేర్కొన్నారు. పి.వెంకటరమణ, ఎస్.రాజు, పి.శ్రీనునాయక్, ఎం.జనార్దన్, బి.సత్యం, ఎల్.బాలయ్య, వి.కృష్ణ, శ్రీకాంత్, లక్ష్మీదేవమ్మ, అరుణ, ఎల్.రాములు, జి.శివారెడ్డి, కె. వెంకటయ్య, కె.రవికుమార్, బి.నర్సింలు, కె. రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.


చెరువులో డంప్ చేసిన చెత్తను చూపుతున్న నాయకులు

పాతబస్తీ చెత్త..

పట్నం చెరువులో డంప్

రెండు టిప్పర్లు సీజ్

విచారణ చేస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువులో రాత్రి వేళ హైదరాబాద్ పాతబస్తీ నుంచి చెత్త, వ్యర్థాలను టిప్పర్ల ద్వారా దొంగచాటున తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు శనివారం రాత్రి చెత్తను తీసుకొచ్చిన రెండు మినీ టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పట్టుబడిన వాహనాలపై జీహెచ్ఎంసీ అని రాసి ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నగరం నుంచి వచ్చి పట్నం చెరువులో చెత్త డంప్ చేయడమేమిటని తేలాల్సి ఉంది. దీనిపై సమగ్ర విచారణ చేస్తున్నామని సీఐ ఎం.మహేందర్‌రెడ్డి తెలిపారు.

పట్నం చెరువును కాపాడండి

ఇబ్రహీంపట్నం చెరువులో కలుషిత వ్యర్థాలను తెచ్చి డంపింగ్ చేయడంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు చెరువును పరిశీలించి సీఐ మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. జెలమోని రవీందర్, జక్క రాంరెడ్డి, మెట్టు దామోదర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.





సీజనల్ పంజా!

వాతావరణంలో మార్పులు, ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు జిల్లా ప్రజలను వణికిస్తున్నాయి. పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా డెంగీ, టైఫాయిడ్, మలేరియా తదితర విష జ్వరాలు ప్రబలుతున్నాయి. వైరల్ ఫీవర్ బారినపడి వైద్యంకోసం వచ్చేవారితో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే కలుషితమైన నీరు తాగడంతో ప్రజలు మంచం పడుతున్నారు.

జ్వరంతో అల్లాడుతున్న ప్రజలు

- వైరల్, డెంగీ, టైఫాయిడ్‌తో సతమతం
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- పేదలకు భారంగా ప్రైవేట్ వైద్యం ఖర్చు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు ముప్పు తిప్పలు పెడుతున్నాయి. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ఇళ్ల చుట్టూ నీరు నిల్వ, వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో ఈగలు, దోమలు వ్యాప్తి ఎక్కువగా ఉంది. దీని కారణంగా జిల్లా వ్యాప్తంగా సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ప్రజలు వైరల్ ఫీవర్ బారినపడుతున్నారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. పలుచోట్ల నర్సులు, ఏఎన్ఎంలు పరీక్షించి మందులు అందిస్తున్నారు. అత్యవసర సమయంలో ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తూ దుర్వాసన వస్తుంది. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. దీంతో ప్రస్తుతం ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. సాధారణంగా ప్రతీ సంవత్సరం జూలై నుంచి నవంబర్ వరకు సీజనల్ వ్యాధులు వ్యాపించే కాలం. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం జ్వర పీడితుల సంఖ్య రెట్టింపుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 84,908 జ్వరం కేసులు నమోదయ్యాయి. 650 డయేరియా కేసులు నమోదు కాగా, 902 రక్త విరేచనాల కేసులు

మిగతా 8వ పేజీలో...

అప్రమత్తంగా ఉండాలి



వర్షాలు కురుస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. డయేరియా, మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఆశాలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి జ్వర సర్వే చేస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను అందుబాటులో ఉంచాం.

- వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి

కేసుల వివరాలు

సంవత్సరం	జ్వరం	విరేచనాలు	టైఫాయిడ్	స్వైన్‌ఫ్లూ	శ్వాసకోశ
2023	1,51,064	1,580	267	76	826
2024	1,26,808	807	90	52	153
2025	84,908	902	3	15	22
మొత్తం	3,62,780	3,289	360	143	1,001


వరద తాకిడికి కోతకు గురైన రోడ్డు

ఆదమరిస్తే అంతే..!

కోతకు గురైన లేమామిడి-నిర్దవెల్లి రోడ్డు

» బిక్కుబిక్కుమంటూ ప్రయాణం

» నిధుల మంజూరుకు ఎదురుచూపు

కేశంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేమామిడి, నిర్దవెల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు కోతకు గురవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లేమామిడి శివారులో ఉన్న చెరువు నిండి ఉధృతంగా నీరు ప్రవహించింది. దాదాపు మూడు రోజుల పాటు వరద పారడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి వరద తాకిడికి కోతకు గురైంది. గతంలో ఇక్కడ రోడ్డును నిర్మించినప్పటికీ వరద నీరు ప్రవహించేందుకు వీలుగా కల్వర్టును నిర్మించలేదు. వరద ఉధృతిని అంచనా వేయకుండా చిన్నపాటి కల్వర్టును నిర్మించారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ఆ కల్వర్టు నిండి రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు కోతకు గురవుతుంది. ఈ దారిపై వాహనదారులు, రైతులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. వాహనాలు వెళ్లే క్రమంలో రోడ్డు కోతకు గురైన ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనదారులు ఆదమరిస్తే.. పెను ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. అదేవిధంగా రాత్రి సమయాల్లో కోతకు గురైన రోడ్డు కనబడటం లేదు. వర్షాకాలంలో ప్రతీ ఏడాది ఇలాగే జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కంటి తుడుపు చర్యగా నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి కల్వర్టును విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



వరదలు వచ్చినప్పుడు ప్రతీ సంవత్సరం రోడ్డు కోతకు గురవుతుంది. అధికారులకు సమస్యను పలుమార్లు విన్నవించినా తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. వర్షాలు వచ్చినప్పుడు వరద తాకిడికి శ్మశానవాటికలోకి సైతం నీరు చేరుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

ఖాజాపాషా, నిర్దవెల్లి గ్రామ వార్డు మాజీ సభ్యుడు



గ్రామాల్లో నయా ట్రెండ్!

- జోరుగా వీధి వ్యాపారం
- చెంతకే సరుకులు..
- గుమ్మం ముందే సంత
- వాహనాలపై తిరుగుతూ అమ్మకాలు

7

దంచికొట్టిన వాన

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో వర్షం ముంచెత్తింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వాగులు వంకలు పొంగి పొర్లాయి. ఈసీ మూసీ నదులు ఉప్పొంగాయి. చెక్ డ్యాంలు అలుగు పారాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటిఅన్నారం వద్ద అత్యధికంగా 128.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గండిపేట మండలం మణికొండలో 71.0 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాములలో 55.0 మిల్లీమీటర్లు, సరూర్‌నగర్‌లోని అలకపూరి కమ్యూనిటీ హాల్లో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో 88.5 మిల్లీమీటర్లు, మల్కాజిగిరిలో 82.5 మిల్లీమీటర్లు, నేరేడ్‌మెట్‌లో 80.0 మిల్లీమీటర్లు, అల్వాల్‌లోని పీహెచ్‌సీ సెంటర్ వద్ద 79.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆదివారం ఆమనగల్లులో అట్టహాసంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకొని మజీద్‌లలో నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జామా మజీద్ కమిటీ అధ్యక్షుడు మాసూమ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల మీదుగా మక్కా నమూనా సెట్‌తో ర్యాలీ కొనసాగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, ప్రముఖ సంఘ సేవయకుడు పాపిశెట్టి రాము, మాసూమ్, ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్‌మైనోద్దీన్, జబ్బార్, సయ్యద్ ఖలీల్, రజాక్, జలాల్ పాల్గొన్నారు.


ఆమనగల్లులో ముస్లింల ర్యాలీ


రేగడిఘనాపూర్ వడ్డెర బస్తీకి వెళ్లే రోడ్డు మార్గంలో వాగు

వంతెన పూర్తయ్యేనా.. వెతలు తీరేనా?

ప్రారంభం కాని వడ్డెర బస్తీ బ్రిడ్జి నిర్మాణ పనులు

- భూమిపూజ చేసి రెండేళ్లు..
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందుల్లో ప్రజలు

చేవెళ్ల సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం... పాలకుల అలసత్వం కారణంగా ప్రజలు, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలప్పుడు హామీలు గుప్పిస్తూ ఓట్లు వేయించుకుంటున్న నాయకులు.. ఆ తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. చేవెళ్ల మండల పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామానికి అనుబంధ గ్రామం వడ్డెరబస్తీ ఉంది. ఈ బస్తీలో దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. ఈ గ్రామానికి వెళ్లాలంటే రేగడిఘనాపూర్ గ్రామం నుంచి దాదాపు కిలోమీటరుకు పైగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ గ్రామానికి ఇప్పటికీ మట్టిరోడ్డే దిక్కు. గ్రామం నుంచి కొద్దిదూరం వెళ్లాక మధ్యలో వాగు దాటుకుంటూ పోవాలి. వర్షం పడిందంటే చాలు అటుఇటు రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతాయని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగులో ఇప్పటికి నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో వాహనాలు రాకపోకలు సాగించడానికి వీలు ఉండడం లేదు. విద్యార్థులు రోజూ ఈ వాగును

మిగతా 8వ పేజీలో...

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

రాష్ట్ర హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి రాములు


మాట్లాడుతున్న వంగూరు రాములు

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని రాష్ట్ర హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ఆరోపించారు. పోరాడి సాధించుకున్న కార్మిక కట్టాలను రద్దు చేస్తూ వేదనకు గురి చేస్తుందన్నారు. ఆదివారం కడ్తాల మండల కేంద్రంలో జిల్లా హమాలీ ప్రథమ మహాసభలు నిర్వహించారు. వంగూరు రాములు, సీఐయుటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక వేత్తల, పెట్టుబడిదారులకు బీజేపీ నాయకులు కొమ్ముకాస్తున్నారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా హమాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా పగడాల యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్, కోశాధికారిగా పెంటయ్య, ఉపాధ్యక్షులుగా వీరయ్య, గోపాల్, రమేశ్, దుర్గయ్య, సహాయ కార్యదర్శులుగా మొగులయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, నర్సింహ్మ, దయానంద్ ఎన్నికయ్యారు.

150 కేజీల బెల్లం స్వాధీనం


పట్టుబడిన బెల్లంతో ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ అధికారులు ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 150కేజీ బెల్లం పట్టుబడిందని సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రబాద్ మండలానికి చెందిన ఎల్లమ్మ హైదరాబాద్ నుంచి 150 కేజీల బెల్ల, పట్టిక సంచులు తీసుకొస్తూ ఆమనగల్లు బస్టాండ్‌లో అనుమానాస్పదంగా నిలబడి ఉంది. ఎక్సైజ్ అధికారులు ఆమె వద్ద ఉన్న మూడు సంచులను తీసి చూడగా బెల్లం, పట్టిక ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా బెల్లం అమ్మినా, సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ఫాంహౌజ్‌లు, ఫంక్షన్ హాళ్లలో అనుమతులు లేకుండా మద్యం వినియోగిస్తే సహించేది లేదన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ బాల్‌రాజ్, సిబ్బంది సురేశ్, శ్రీను, శ్రీజ తదితరులు ఉన్నారు.

పదిహేనేళ్లుగా అసంపూర్తిగా పాఠశాల భవనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల కోసం ప్రారంభించిన భవన నిర్మాణం పదిహేనేళ్లుగా అసంపూర్తిగా ఉంది. దీంతో ప్రజాధనం వృథా అయిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిర్మాణం చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని అంటున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ పంచాయతీ పరిధి జోగమ్మగూడలో పాఠశాల నిర్మాణానికి 2005లో సాక్షర్ భారత్ నిధులు రూ.75వేలతో స్కూలు భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. బేస్మెంట్, పిల్లర్లు నిర్మించి స్లాబ్ వేశారు. తర్వాత గ్రామంలో బడికి వచ్చే పిల్లల సంఖ్య తక్కువగా ఉందని అక్కడి పాఠశాలను ఎత్తివేశారు. దాంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీల విభజన తర్వాత జోగమ్మగూడ గ్రామాన్ని రామేశ్వరం పంచాయతీలో కలిపారు. రామేశ్వరం పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు గడిచినా అసంపూర్తి నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అసంపూర్తి భవనాన్ని పూర్తి చేసి గ్రామ అవసరాల కోసం వినియోగించేలా గ్రామస్తులు కోరుతున్నారు.



ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

బూర్గుల సేవలు ఆదర్శం



బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్టేట్ మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సేవలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రామకృష్ణారావు వర్ధంతిని పురస్కరించుకుని షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. ప్రజ్ఞశాలి, స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయ కోవిదుడిగా కీర్తి పొందారన్నారు. బూర్గుల పుట్టిన గడ్డ మీద తాను ఎమ్మెల్యేగా కొనసాగడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొంకళ్ల చెన్నయ్య, సులోచనా కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచాలి

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేందుకు క్రీడాకారులు చొరవ చూపాలని సూచించారు. ఆదివారం షాద్‌నగర్ మినీ స్టేడియంలో పట్టణవాసి అంజన్‌గౌడ్ రూ.1.5 లక్షలతో కొని సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు అలవాటు పడుతూ క్రీడలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు కూడా పిల్లలకు విద్యాభ్యాసంతో పాటు, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు కృషిచేయాలని సూచించారు. క్రీడలకు తనవంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రవితేజ పాల్గొన్నారు.

స్వార్థశక్తుల కుట్రలను తిప్పికొట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): లంబాడాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు ప్రయత్నించినా సహించేది లేదని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతినాయక్ అన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారమే లక్ష్యంగా గిరిజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కడ్తాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్పతి మాట్లాడుతూ.. లంబాడాలను ఎస్టీ జాబితాల నుంచి తొలగించాలని బీజేపీ మాజీ ఎంపీ సోయం బాబూరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేస్తున్న కుట్రలను లంబాడాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ఫలితంగా దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లంబాడాల సామాజిక వెనుకబాటును గుర్తించి వారిని ఎస్టీలో జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. తండాల్లోని ప్రజలు ఆర్థిక వెనుకబాటుతో దుర్భర జీవితాలు ఎల్లదీస్తున్నారని లక్పతినాయక్ అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే ఎన్ని పోరాటాలకైన వెనుకాడం అని స్పష్టం చేశారు. ఇప్పుడిప్పుడే లంబాడాలు విద్య, రాజకీయ, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఎస్టీ జాబితాల నుంచి తొలగించేందుకు కుట్ర చేయడం అన్యాయం అన్నారు. నేతలు కుట్రలు వీడకుంటే లంబాడాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు కల్పించి ఎస్టీ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. తండాల్లో పల్లె వైద్య శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, పత్యానాయక్, రాజునాయక్, రతన్‌నాయక్, హరిలాల్‌నాయక్, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి వరం అని కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నేదునూరుకు చెందిన ముగ్గురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన మాజీ వైస్ ఎంపీపీ శమంతతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో అఫ్జల్ బేగ్, పాండురంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, బాబు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



మహిళలకు చెక్కులు అందజేస్తున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



తుక్కుగూడలో స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహద పడతాయని కేఎల్ఆర్ అన్నారు. తుక్కుగూడలోని కేఎల్లార్ వెంచర్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల క్రీడాకారులకు స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైసమ్మను దర్శించుకున్న సినీ నటుడు శ్రవణ్

కడ్తాల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సినీ నటుడు శ్రవణ్, టీవీ నటులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. శ్రవణ్‌ను ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఉన్నారు.



శ్రవణ్‌ను సన్మానిస్తున్న ఈవో స్నేహలత

చేవెళ్లలో వైద్య శిబిరం విజయవంతం



శిబిరంలో వైద్యం అందిస్తున్న వైద్యులు

చేవెళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి సభ్యుడు గోపాలచారి అన్నారు. ఆదివారం చేవెళ్ల, పామెన, బస్తేపూర్, రామన్నగూడ, కౌకుంట్ల, తంగడ్‌పల్లి, రావులపల్లి, మల్లారెడ్డిగూడ, ఖానాపూర్ తదితర గ్రామాల్లో ఉచిత మెగావైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యం పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 64 మంది వైద్యులు, 200మంది సిబ్బందితో నిర్వహించిన వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. స్వామివారి ఆశీర్వాదంతోనే వైద్య శిబిరం విజయవంతమైందని అన్నారు. మొత్తం 3,958 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు, కన్ను, డెంటల్, ఈఎన్‌టీ, గుండె, శ్వాస సంబంధ వ్యాధులు, యూరాలజీ, స్త్రీ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో సత్యసాయి సేవా సమతి ర్యాలీ...

చేవెళ్లలో భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు ప్రధాన వీధుల్లో సత్యసాయి బాబా చిత్రపటాన్ని వాహనంపై పెట్టి ర్యాలీ నిర్వహించారు. సాయిరాం నామ స్మరణతో పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాల్లో సేవలందించిన సత్యసాయి భక్తులు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి

విమోచనోత్సవాన్ని విజయవంతం చేయాలి

కొత్తూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఈ నెల 17న విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త నడుం బిగించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రణధీర్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సేవా పక్వాడ్ కార్యక్రమానికి మహేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. హైదరాబాద్ విమోచన, తెలంగాణ స్వాతంత్యానికి ప్రాణత్యాగం చేసిన అమరుల చరిత్ర ప్రతీ తరానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ కోకన్వీనర్ అమడపురం నర్సింహాగౌడ్, సేవా పక్వాడ్ జిల్లా కోకన్వీనర్ ప్రశాంత్, నాయకులు ఎర్రవెల్లి నాగరాజచారి, మల్లేష్, ప్రదీప్, శేఖర్,గణేష్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, సురేందర్, అరవింద్, శ్రీశైలం, మహేందర్, సురేష్, సందీప్‌సింగ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తిగా ముందుకు సాగాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ ప్రతినిధులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు శ్రమించాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు కార్యక్రమంలో భాగంగా బెస్త సంఘం నాయకుడు నర్సింహతో కలిసి ఎదులాబాద్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా విద్యలో రాణించాలని అన్నారు. నాడు అంబేడ్కర్ శ్రమించి ఉన్నత విద్య అభ్యసించడంవల్లే అవకాశాలను పొందగలిగాడన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింగరావు, అంజనేయులు, అశోక్, రవి, రాజేష్, భరత్, గణేష్ పాల్గొన్నారు.

వన్య ప్రాణుల రక్షణలో అధికారులు విఫలం



అడవి పందులను చంపి కాల్చిన వేటగాళ్లు (ఫైల్)

మర్పల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వన్య ప్రాణులతోనే ముడిపడి మనుషుల మనుగడ ఉంటుందని పదే పదే చెబుతున్నా వన్య ప్రాణుల రక్షణలో సంబంధిత అధికారులు విఫలం అవుతున్నారు. అటవీ ప్రాంతాల్లోని జంతువులను కొందరు వేటాడి చంపి మాంసం రూపంలోకి మార్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అడవుల్లో సంచరిస్తూ వన్య ప్రాణులను వేటాడి వాటి ప్రాణాలను హరిస్తున్నారు. మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో కొంత కాలంగా అడవి పందుల వేట జోరుగా కొనసాగుతోంది. అడవి పందులను వేటాడి వాటిని కాల్చి మాంసం విక్రయిస్తున్నారు. రైతుల పంటలను అటవీ పందులు నాశనం చేస్తున్నా రైతులు వాటికి ఎలాంటి హాని చేయకుండా పంటను కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వన్యప్రాణుల రక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



పరిగిలో మొబైల్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలోని ఎంసీసీ కాంప్లెక్స్‌లో స్వయం ఉపాధి కింద అస్లామ్ ఏర్పాటు చేసుకున్న మొబైల్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం యువత ఉపాధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. ఉద్యోగాల కంటే వ్యాపార రంగంలో ఎక్కువగా సంపాదించొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్, అక్బర్ సేట్, ఉస్మాన్ అలీ, అస్లామ్ పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తే



రాపోల్‌లో దెబ్బతిన్న పత్తి చేను

- ఆరంభంలో కరువు.. అనంతరం అతివృష్టి
- అధిక వర్షాలకు దెబ్బతిన్న చేలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడైనా రాదని అన్నదాతల ఆందోళన



కొట్టుకుపోయిన పత్తి మొక్కలు



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో దెబ్బతిన్న చేను వద్ద ఆవేదనలో రైతులు

పరిగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ వానకాలంలో కురిసిన అధిక వర్షం పత్తి రైతును చిత్తు చేస్తోంది. ఆరంభంలో వర్షాభావం, కొన్ని రోజుల కిందటి వరకు కురిసిన అధిక వర్షాలతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఎదిగిన పత్తి చేలు అతివృష్టితో చాలా మేర దెబ్బతిన్నాయి. పత్తి కాయలు రాలిపోయాయి. మొక్కలు నీట మునిగి కుళ్లిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు దిక్కులు చూస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి పత్తిసాగు తగ్గించారు. గతేడాది 2,53,063 ఎకరాల్లో పత్తి సాగుచేయగా, ఈ సారి 2,50,134 ఎకరాల్లో వేశారు. రైతుల ఆశలపై అధిక వర్షం నీళ్లు చల్లింది. మొదట్లో వర్షాలు రాక ఆలస్యంగా విత్తారు. ఇప్పుడేమో అధిక వర్షాలతో నష్టం కలిగింది. దిగుబడి సగం కూడా రాని పరిస్థితులేర్పడ్డాయి. జిల్లాలో 50వేల ఎకరాలకుపైగా పత్తి పంటకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. అధికారుల మాత్రం రెండు వేల ఎకరాల్లోపే నష్టం జరిగిందని చెబుతున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12క్వింటాళ్ల నుంచి 20క్వింటాళ్ల దిగుబడొచ్చేది. పంటలు మునిగిన నేపథ్యంలో ఎకరానికి రెండు,మూడు క్వింటాళ్లే రానుంది. ఎకరానికి రూ.35వేల పెట్టుబడి అవుతుంది. ఇంత తక్కువ దిగుబడితో పెట్టుబడైనా రాదని రైతులు వాపోతున్నారు.

అధిక వర్షాలకు తోడు తెగుళ్లు

అధిక వర్షాలకు తోడు భూముల్లో పోషకాల లోపంతో పత్తి మొక్కలు ఎర్రబారి ఆకులు, కాయలు రాలుతున్నాయి. ఎర్ర భూముల్లో ఈ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నల్లభూముల్లో కాస్త ఆలస్యంగా బయట పడుతుంది. వేల ఎకరాల పంటకు తెగులు సోకింది. మొక్క చనిపోతుండడంతో ఏం చేయలేని స్థితిలో రైతులున్నారు.

మొలకెత్తక మళ్లీ మళ్లీ నాటి

మొదట్లో చిన్నపాటి వర్షాలకు నాటిన విత్తనాలు మొలకెత్తలేదు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు రెండోసారి విత్తుకున్నారు. ఆగస్టు నెలలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో చేలల్లో నీరు చేరి మొక్కలు కుళ్లిపోయాయి. వాన దెబ్బతోపాటు, బెల్లం తెగులు సోకి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



ఐదు ఎకరాల్లో పత్తి వేశాను. రూ.2లక్షల వరకు పెట్టుబడి అయింది. ప్రారంభంలో వర్షాలు కురియక ఆలస్యంగా విత్తాం. తర్వాత అధిక వర్షానికి పంట నీరేసి మొక్కలు మురిగిపోయాయి. పత్తి కాయ దశలోనే నీరుపట్టి పోయింది. బాగున్న మొక్కల కాయలు అధిక వర్షాలకు రాలిపోయాయి. మొక్కకు 20నుంచి 25కాయలు కూడా లేవు. యూరియా కొరతా ఇబ్బంది పెట్టింది. ఎకరానికి 2 క్వింటాళ్లయినా వచ్చే పరిస్థితి లేదు.

- నారాయణ, పత్తి రైతు, రాఘవాపూర్

పత్తి పంట నష్టం వాస్తవమే



అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటున్నది వాస్తవమే. ప్రధానంగా పత్తి పంటకు నీరు ఎక్కువై నీరుపట్టి మొక్కలు చనిపోయాయి. భారీ వర్షానికి నీరు నిలిచి, మట్టికప్పేసి నష్టం జరుగుతున్నది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పత్తి పంట నష్టాన్ని వివరాలు సేకరిస్తున్నారు.

- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్



నూతన కార్యవర్గంతో మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కొండకల్ గ్రామ యువజన విభాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే ఆయువుపట్టని గుర్తుచేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి సాధించాయని, ప్రస్తుతం కుంటుపడిందని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడిగా రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, ఉపాధ్యక్షుడిగా రాములు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి. గ్రామ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు నవీన్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెడ్డి సేవా సమితి నూతన కమిటీ



రెడ్డి సేవా సమితి నూతన కమిటీ సభ్యులు

కేశంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల రెడ్డి సేవా సమితి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా తలసాని మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా తలసాని రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తలసాని ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, సభ్యులుగా పురుషోత్తంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమణరెడ్డి, హరికృష్ణారెడ్డి, తలసాని కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యెన్నం శ్రీధర్ రెడ్డి, తలసాని వెంకట్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌కు ఘట్‌కేసర్, పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్‌ల్లో అనూహ్య స్పందన లభించింది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న లోక్ అదాలత్‌లో ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లోని 102 కేసులు, 330పెట్టి కేసుల్లో వాదులు, ప్రతివాదులు రాజీ పడ్డారని తెలిపారు. చిన్న చిన్న గొడవలు, కుటుంబ సంబంధ తగాదాలు, అప్పులు, సంపద విభజన వంటి విషయాల్లో కోర్టులకు పోకుండా లోక్ అదాలత్ వేదికగా నిలిచిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. పోచారం ఐటీ కారిడార్ స్టేషన్ పరిధిలో 70సాధరణ కేసులు, 645 పెట్టి కేసుల్లో రాజీపడ్డారని సీఐ రాజువర్మ తెలిపారు.

దాతలు ముందుకు రావాలి



మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ తన ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో దాతల సాయంతో 'పేదల కోసం యాత్ర దానం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తీర్థయాత్రలకు వెళ్లే స్థోమత లేని పేద వృద్ధులు, దివ్యాంగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకోసం దాతలసాయం కోరుతూ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో వీరికి ప్రయాణించే వీలు కల్పించటానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు. ఆసక్తిగల వారు 9959226151, 9849737131 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మందుల పిచికారిలో జాగ్రత్తలు తప్పనిసరి

- అధిక మోతాదులో రసాయనాలు వాడొద్దు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



మేడిపల్లిలో పంటకు రసాయన మందు పిచికారి చేస్తున్న రైతు

యాచారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పంటలకు సోకుతున్న చీడపీడల నివారణకు మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడొద్దని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది పత్తి 1,38,478 ఎకరాలు, మొక్కజొన్న 68,364 ఎకరాలు, వరి 1,17,022 ఎకరాలు, జొన్న 5,762 ఎకరాలు, కంది 14,914 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంటలపై చీడపీడల నివారణకు రసాయన మందులు అధికంగా వాడుతున్నారు. తెగుళ్ల నివారణకు అడ్డగోలుగా మందులు పిచికారి చేస్తూ నష్టపోతున్నారు. రసాయన మందులు ఎక్కువ వాడితే పంటల దిగుబడి పెరగకపోగా పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

అవగాహన లేక అధిక మోతాదు వాడకం

పంటలపై చీడపీడల నివారణకు మందుల వాడకంపై ఎక్కువ మంది రైతులకు అవగాహన ఉండటం లేదు. అవసరం ఉన్నదాని కన్నా ఎక్కువ మోతాదులో మందులు వాడి నష్టపోతున్నారు. రైతులకు దుకణాదారులు వివిధ రసాయన మందులు అంటగట్టి పంపుతున్నారనే విమర్శలున్నాయి.

మెలకువలు పాటించాలి

పంటలపై చీడపీడల నివారణకు మందులు వాడే సమయంలో రైతులు మెలకువలు తప్పక పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. మందుల పిచికారి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చేతులకు ప్లాస్టిక్ గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి. తలపై ప్లాస్టిక్ కవరు(టోపి) పెట్టుకోవాలి. ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి. మోచేతి వరకు ప్లాస్టిక్ కవరు కట్టుకోవాలి. మందుల పిచికారి అనంతరం పూర్తి శరీరాన్ని సబ్బుతో కడుక్కోవాలి. కళ్లలో మందు పండకుండా కూలింగ్ గ్లాసులు ధరించాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు.

సేంద్రియంతో అధిక దిగుబడి



పంటలపై చీడపీడల నివారణకు రసాయన మందులను తక్కువ మోతాదులో పిచికారి చేసుకోవాలి. అధికారుల సూచనల మేరకే మందులువాడాలి. సేంద్రియ మందుల వాడకంతో పంట దిగుబడి పెరిగి, నేల సారవంతాన్ని కాపాడుకోవచ్చు. అలాగే పంట ఉత్పత్తి నాణ్యతగా ఉంటుంది. భూసార పరీక్షల ఆధారంగానే మందులు వాడాలి. ప్రకృతి వ్యవసాయ విధానంతోనే పర్యావరణానికి మేలు.

- బి.ఉష, జిల్లా వ్యవసాయాధికారి

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



గుమ్మడవెల్లిలో మాట్లాడుతున్న నాయకుడు జయేందర్

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మహేశ్వరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గుమ్మడవెల్లి, మాదాపురం, కొలన్‌గూడ గ్రామాల్లో ఆ పార్టీ గ్రామస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు గుర్తుచేశారు. అధికారం చేపట్టి రెండేళ్ల గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశాల్లో కొనల్‌గూడ మాజీ సర్పంచ్ గీతేశ్వరి గణేష్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, శేఖర్‌గుప్తా, మన్కు బాబు, జంగయ్య, దేవిలాల్‌నాయక్, తాళ్ల కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి, భద్రయ్య, టి.ఇందిర, టి.దేవేందర్, కుమార్, మహేందర్, భాస్కర్, యాదగిరి, గణేష్, బీరప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 312వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్

కడ్తాల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించినా, అక్రమంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ముంతాజ్ హెచ్చరించారు. భూముల కొనుగోలు చేసేవారు ఆయా సర్వే నెంబర్‌లలోని భూముల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపించి అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పక్కపక్కనే ఉన్న సర్వేనెంబర్‌లలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములుంటే.. ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి మాయమాటలతో కొనుగోలుదారులను మోసం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో ఉంచడం జరిగిందన్నారు. కొనుగోలుదారులు భూములు కొనుగోలు చేసే సమయంలో పూర్తి విచారణతో కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించినా, అమ్మినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రభుత్వం స్పందించే వరకు పోరాడుతాం

- ఆరో రోజు రిలే దీక్షలో పాల్గొన్న మహిళా రైతులు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిర్వాసిత రైతులు

కడ్తాల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు అన్నారు. విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్పు వరకు ఊరుకునేది లేదన్నారు. కడ్తాల సమీపంలోని పంటపొలాల మీదుగా ఏర్పాటు చేయదల్చిన 765 కేవీ లైన్‌ను మార్చాలనికోరుతూ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరింది. దీక్షలో నిర్వాసితులు మహిళా రైతులు గంట రాధిక, స్వాతి, నర్సింహ, శివరామ్ రెడ్డి, జి.కృష్ణ, రాములు కూర్చున్నారు. రైతులకు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. బీదర్ పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ కర్నాటకలోని బళ్లారి నుంచి మీర్ఖాన్‌పేట వరకు వేస్తున్న హైటెన్షన్ లైన్‌కు భూములు తీసుకుంటే తాము ఉపాధి కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలలుగా ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. లైన్‌ను మార్చే వరకు దీక్షలను కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. దీక్షలో నాయకులు కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, పర్వతకుమార్‌యాదవ్, పి.వెంకటేశ్, రాములయ్య, వెంకట్రాములుగౌడ్, కాలె వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

బస్టాండ్‌ను కూల్చిన గుర్తుతెలియని వ్యక్తులు



ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న నాయకులు తండా వాసులు

కోట్‌పల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వ్యక్తులు బస్టాండ్ కూల్చివేసిన ఘటన బార్వాద్ తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డుపై ఉన్న బస్టాండ్‌ను జేసీబీతో కూల్చివేశారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండా వాసులకు నిలువనీడ లేకుండాపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నాయకుకులతో కలిసి రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శైలజ అక్కడికి చేరుకుని మాట్లాడారు. నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బస్టాండ్ కింద ఎవరైనా ఉన్నారేమోనని పోలీసులు జేసీబీతో శిథిలాలను తొలగించి చూశారు. ధర్నాలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సుందర అనిల్, మాజీ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నాయకుడు కృష్ణయాదవ్, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌కుమార్ తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి



బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కళల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయలను పరిరక్షించాలని సంస్కార భారి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని సిద్ధార్థ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్కార భారతి జాతీయ స్థాయిలో పనిచేస్తుందని, అంతరిస్తున్న కళలను కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు సంస్కార భారతి వేదికగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రానున్న దేవీ నవరాత్రుల సందర్భంగా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరం సంస్కార భారతి బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా మండలి అధ్యక్షులు టి.రాజు, సంస్కార భారతి కార్యదర్శి టి.ప్రభాకర్, ఉపాధ్యక్షులు భూపాల్, ఆనంద్, విశ్వనాథం, రాఘవేందర్ గుప్తా, సంజీవ్, ప్రదీప్, మ్యాడం దత్తు, ఆర్.శ్రీనివాస్, నవీన్, మంజుల, మమత తదితరులు పాల్గొన్నారు.



మోపెడ్‌పై వెళ్తూ మంచాల అమ్మకాలు

గ్రామాల్లో నయా ట్రెండ్!

జోరుగా వీధి వ్యాపారం

- చెంతకే సరుకులు.. గుమ్మం ముందే సంత
- వాహనాలపై తిరుగుతూ వస్తు అమ్మకాలు

మంచాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నయా ట్రెండ్ నెలకొంది. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వీధి వ్యాపారం జోరందుకుంది. తెలతెలవారుతుండగానే వాహనాలకు మైకులు పెట్టుకొని గ్రామాలాట్ల తిరుగుతూ చిరు వ్యాపారులు సందడి చేస్తున్నారు. మైకుల చప్పుడు రాగానే ఇళ్లలోని మహిళలు బయటకొచ్చి అవసరం ఉన్న సరుకులు కొంటున్నారు. గుమ్మం ముందుకు వచ్చిన సంతతో వ్యవప్రయాసలు లేకుండా సరుకులు సమకూర్చుకుంటున్నారు. ఇళ్ల ముందుకొచ్చిన వస్తువులతో వారికి బేరమాడే శక్తి కూడా పెరుగుతోంది. వీధి వ్యాపారులు మిరపకాయలు మొదలుకొని పండ్లు, సగటు గ్రామీణ కుటుంబానికి కావాల్సిన నిత్యావసర సరుకులు ఇలా అన్నింటినీ ఇళ్ల వద్దకొచ్చి అమ్ముతున్నారు. ఇళ్లలో ఫర్నిచర్, దుప్పట్లు, చీరలు తదితర వస్త్రాలు గుమ్మం ముంగిటికే వచ్చేస్తున్నాయి. ఇలా సరుకుల కొనుగోళ్లతో మహిళలకు వ్యయం, సమయం కలిసొస్తున్నాయి. అలాగే గ్యాస్‌స్టౌ, గ్రైండర్లు వంటి వస్తువుల రిపేర్లు సైతం మోపెడ్లు, బైక్‌లపై వచ్చి రిపేర్ చేస్తున్నారు.

పురాతన పద్ధతికి ఊపిరి

అప్పట్లో రోడ్లు, వాహనాలు తదితర వసులు లేక వ్యవసాయమే జీవనాధారం గల గ్రామీణులు తమ నిత్యావసర సరులకు వీధివ్యాపారులనే ఆశ్రయించేవారు. కావాల్సిన సరుకులను సమీప అంగళ్లలో సమకూర్చుకునేవారు. ఇప్పుడు ఈ నయా ట్రెండ్‌తో కనుమరుగైన దాసరి గంపల పద్ధతి గ్రామాల్లో మళ్లీ కన్పిస్తోంది. అదెలా అంటే పురాతన కాలం నుంచి ఇటీవలి నగరీకరణ దాకా రకరకాల కులవృత్తుల వారు గ్రామాల్లో తమ ఉత్పత్తులను అమ్ముకుని జీవనం సాగించేవారు. పూసల కుల వృత్తుల వారు వంటగిన్నెలు, పిన్నీసులు, టాల్కం పౌడర్ వంటి సౌందర్య వస్తువులను గ్రామాల్లో తిరిగి అమ్మేవారు. అలాగే కంసాలి, నేతన్నలు, మిర్చి వ్యాపారులు డప్పుచాటింపు వేయించి చౌరస్తాలో అమ్మకాలు జరిపి వెళ్లేవారు. ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ కాలంలోనూ పురతాన పద్ధతే నయాట్రెండ్‌గా మారుతోందని చెప్పొచ్చు. అప్పట్లో నడుచుకూంటూ వీధివ్యాపారం చేసే వారు ఇప్పుడు వాహనాలపై సంచరిస్తూ వస్తు అమ్మకాలు కొనసాగిస్తున్నారు.



వాహనాలపై తిరుగుతూ వస్తువులను అమ్ముతున్న చిరు వ్యాపారులు



సుభాన్‌పూర్ గ్రామంలో వృద్ధులతో బక్కని రవి

మహాధర్నాను విజయవంతం చేయాలి

మహేశ్వరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వితంతులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు(సోమవారం) మండల తహసీల్దార్ కార్యాలయంతో పాటు 20న గ్రామ పంచాయితీ కార్యాలయాల వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని, పింఛన్‌దారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బక్కనిరవి మాదిగ పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించిన సన్నాహక సభ కార్యక్రమం ఆదివారం మండలంలోని సుభాన్‌పూర్ గ్రామంలో ఎర్ర గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎ్ ఎల ఆధ్వర్యంలో మహాధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు నర్సింహ, కమలమ్మ, సుమతి, సరోజ, సభద్ర తదితరులు పాల్గొన్నారు.

'హజ్రత్' దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

షాద్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నేతలు బాబర్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, ఇసాక్ ఆదివారం గుల్బర్గాలోని పవిత్ర హజ్రత్ ఖాజా బందే నవాజ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించామన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ నాయకులు

వంతెన పూర్తయ్యేనా.. వెతలు తీరేనా?

(ఐదో పేజీ తరువాయి)

దాటుకుంటూ రేగడిఘనాపూర్ పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. అలాగే ఇరు గ్రామాలతో పాటు చన్వల్లి గ్రామానికి సైతం లింక్ రోడ్డు కావడంతో ఆ గ్రామ రైతుల పొలాలు సైతం వాగు అవతలి వైపు ఉంటాయి. పంటను మార్కెట్‌కు తరలించాలంటే వాగు వరకు మోసుకుంటూ రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఇరు గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డెర బస్తీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చే నాయకులు తాము గెలిస్తే రోడ్డు, బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్పా. తెలిచిన తర్వాత గ్రామం వైపు చూడటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల క్రితం భూమిపూజ

గత బీఆర్ఎస్ పాలనలో అప్పటి మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో



2023లో కోటి రూపాయల నిధులతో వంతెన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

కలిసి వంతెన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు కోటి రూపాయల నిధులు మంజూరు చేసి 2023లో శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లో వంతెన పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కానీ రెండేళ్ల నుంచి నేటికీ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను గుర్తించి రోడ్డు వేయాలని వడ్డెర బస్తీ వాసులు కోరుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



కొన్నేళ్లుగా ప్రజలు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. శిలాఫలకం వేసిన నేటికి పనులు ప్రారంభం కాలేదు. దాంతో ప్రజల ఇబ్బందులు చూడలేక తన సొంత డబ్బులు రూ.2లక్షలు ఖర్చు చేసి వాగుపై పైప్‌లు వేసి మట్టి పోయించాను. అయితే, భారీ వర్షాల కురిసినప్పుడు వాగు దాటడం చాలా కష్టం అవుతుంది. ప్రభుత్వం తక్షణమే బ్రిడ్జి నిర్మాణంతో పాటు నూతనంగా రోడ్డు ఏర్పాటు చేయాలి.

- తిప్పని రాంరెడ్డి, మాజీ సర్పంచ్, రేగడిఘనాపూర్

వైద్యశిబిరం విజయవంతం

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం జర్నలిస్టులకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది వన్‌మెడి సంస్థ ఆధ్వర్యంలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 130 మంది జర్నలిస్టులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్, రఘు, యాదయ్య, రమేశ్‌నాయక్, కొండల్ యాదవ్, శ్రీపతి, శ్రీను, శేఖర్, శివ, మహేశ్, కళ్యాణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు : మెడికల్ కిట్లను అందిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రావులపల్లి కలాన్ మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 275 మంది గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 30 మందికి కంటి సమస్యలను గుర్తించారు. ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. సత్యసాయి బాబా గచ్చిబౌలి సేవాసమితి సభ్యులు గోపాలచారి, క్యాంపు ఇన్‌చార్జి ప్రభాకర్. వైద్యులు మదన్‌మోహన్, సుధాకర్, సింధు, ప్రత్యూష, చరణ్, నిఖిల్, భావన విహాసిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

గౌడ సంఘం నూతన కమిటీ

తలకొండపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం గౌడ సంఘం నాయకులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొక్కాల రాఘవేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మహేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌గౌడ్, సలహాదారులుగా రవీందర్ గౌడ్, నర్సింహగౌడ్, మహిపాల్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గాన్ని నాయకులు సత్కరించారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బల్మలపల్లి తండాకు చెందిన భాస్కర్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డిలు పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి రూ.4వేలు, ప్రభాకర్ రెడ్డి రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. రాజేందర్ నాయక్, దాసు నాయక్, రవినాయక్, శ్రీకాంత్, బాలకృష్ణ తదితరులున్నారు.

సీజనల్ పంజా!

(ఐదో పేజీ తరువాయి)

నమోదయ్యాయి. సైన్‌ఫ్లూ కేసులు 14 నమోదయ్యాయి.

భారంగా వైద్యం

ప్రభుత్వ ఆస్పత్రులలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారం రోజులపాటు వైద్య సేవలు, వివిధ రక్త పరీక్షలు కోసం రూ. 5 వేలు నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తుంది. పేద, మధ్యతరగతి రోగులు అప్పులు చేసి వైద్యం పొందుతున్న పరిస్థితి నెలకొంది. రోగుల బలహీనతలను ఆసరాగా చేసుకుంటున్న కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు అవసరానికి మించి రక్త పరీక్షలు చేయిస్తుండడమే కాకుండా మూడు రోజులకు బదులు వారం నుంచి పది రోజులు పాటు ట్రీట్మెంట్ ఇస్తూ వేల రూపాయలను దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బాధిత రోగుల జేబులు ఖాళీ అవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ క్లినిక్‌లు, ఆసుపత్రులపై నిఘా ఉంచి సామాన్యులకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజృంభిస్తున్న డెంగీ

జిల్లాలో డెంగీ చాపకింద నీరులా విస్తరిస్తుంది. ఇప్పటి వరకు 203 డెంగీ కేసులు నమోదు కాగా, అత్యధికంగా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 112 డెంగీ కేసులు నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 74 డెంగీ కేసులు నమోదు కాగా, ఎక్కువగా నందిగామ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోనే అధికంగా 5 నమోదయ్యాయి. చిండోడ్, బూర్గుల, ఆరుట్ల, మొయినాబాద్, దుబ్బచర్లలో ఒకటి చొప్పున డెంగీ కేసులు నమోదయ్యాయి. చికున్ గున్యా 4, మలేరియా ఒక్క కేసు మాత్రమే నమోదైంది.

జిల్లాలో నమోదైన సీజనల్ వ్యాధుల వివరాలు

నెల	జ్వరం	డయేరియా	విరేచనాలు	స్వైన్‌ఫ్లూ	డెంగీ
జనవరి	11,215	98	119	03	09
ఫిబ్రవరి	10,891	111	114	03	02
మార్చి	11,511	117	143	01	02
ఏప్రిల్	11,025	79	86	01	04
మే	10,718	58	138	-	18
జూన్	10,202	77	119	-	45
జూలై	10,778	78	109	05	57
ఆగస్టు	8568	32	74	01	66
మొత్తం	**84,908**	**650**	**902**	**14**	**203**

ఘనంగా చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు



కడ్తాల్ : చల్లాను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్/కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం కడ్తాల మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో నర్సింహారెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షాబొద్దీన్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు వెంకటేశ్వరు, రమేశ్ నాయక్, తదితరులు ఉన్నారు. అలాగే చల్లా జన్మదిన వేడుకలకు కందుకూరు మండల నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నగర శివారులోని మీర్‌పేటలో ఉన్న ఆయన నివాసంలో నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, ఎస్.కృష్ణానాయక్‌లు, బొక్క జంగారెడ్డిలు తదితరులు ఆయన్ను కలిశారు. కాంగ్రెస్ నాయకులు జగదీశ్, రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : నర్సింహారెడ్డి జన్మదిన వేడుకల్లో ఏనుగు జంగారెడ్డి, కృష్ణానాయక్, బి.జంగారెడ్డి



కేశంపేట : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ నరహరి

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను జయప్రదం చేయాలి

కడ్తాల్/కేశంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న నార్సింగ్‌లో నిర్వహించే హైదరాబాద్ ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో-2025 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్, కడ్తాల్ మండలాధ్యక్షుడు జాల శ్రీశైలం కోరారు. ఈమేరకు ఆదివారం కడ్తాల్‌లో ఎస్సై వరప్రసాద్ చేతుల మీదుగా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. భీష్మాచారి, చిప్ప కిరణ్‌కుమార్, రబ్బాని, మహేశ్, శివశంకర్, కృష్ణ, తరుణ్, నవీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను కేశంపేట సీఐ నరహరి ఆవిష్కరించారు. కేశంపేట మండల ఫొటోగ్రాఫర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 19, 20, 21లలో హైదరాబాద్‌లో ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు ఆసోషియేషన్ సభ్యులు వివరించారు. జిల్లా కార్యవర్గసభ్యుడు చిర్ర మహేష్, మండలాధ్యక్షుడు బాలు, ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి విజయ్, చిర్ర ప్రభాకర్, భక్తవత్సల్, నిరంజన్, తిరుపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి
- మంచాలలో బీజేపీ సేవాపక్షం-2025 సమావేశం



మంచాల : కార్యక్రమంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలను విస్తృతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.లచ్చిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాడు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకొని ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించతలపెట్టిన బీజేపీ సేవాపక్షం-2025 కార్యక్రమానికి సంబంధించి ఆదివారం మంచాలలో పార్టీ శ్రేణులతతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ పక్షం రోజుల పాటు సాగే ఈ సేవా కార్యక్రమాల్లో రక్తదాన శిబిరాలు, ఆత్మనిర్భర్‌భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం, శక్తి కేంద్రం, మండల కేంద్రాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంకా బూత్, మండలస్థాయిలో మొక్కలు నాటాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నూకంరాజు, జిల్లా నాయకులు మారగోని శ్రీశైలం, పాండాల జంగయ్య, చివిరాల పాండు, కారింగ్‌రాజు, కె.జనార్థన్‌రెడ్డి, మెండు వెంకట్ రెడ్డి, యాట రమేష్, గంట నర్సింహారెడ్డి, ఆలూరి శేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి యాదగిరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్యయాదవ్ అన్నారు. మండలంలోని దుబ్బచర్ల గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు తెల్గమల్ల యాదీశ్ అధ్యక్షతన సేవాపక్షం కార్యక్రమాల సన్నాహక సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, సేవాపక్షం ఉత్సవాల కమిటీ కో-ఆర్డినేటర్ అనంతయ్యగౌడ్, మాధవాచారి, యాదయ్యగౌడ్, పి.సుదర్శన్‌యాదవ్, దేశ్యానాయక్, ముత్యం, కాసాని వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.



మహేశ్వరం : మాట్లాడుతున్న జంగయ్య యాదవ్

కొందుర్గు : గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు హాజరై మాట్లాడుతూ... కార్యకర్తలు అందరు గ్రామాల్లో సేవాపక్షోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబరు 17న విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. బల్వంత్‌రెడ్డి, బోయ అశోక్, శివారెడ్డి, కొమరబంబ శ్రీశైలం, అంజయ్య, కార్తీక్‌యాదవ్, చంద్రశేఖర్, రఘునాథ్‌రెడ్డి, గోపాల్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు : మాట్లాడుతున్న సుధాకర్‌రావు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తలకొండపల్లి : సమ్మేళనంలో టీచర్లు, పూర్వ విద్యార్థులు

తలకొండపల్లి/కేశంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. అలాగే కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2000-2001 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సమ్మేళనం నిర్వహించారు. పాఠాలు బోధించిన టీచర్లను సన్మానించారు.



కేశంపేట : ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాతపడ్డారు. బైక్‌ను డ్రైవ్ చేస్తూ లారీని ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన ఆదివారం చేవెళ్ల పట్టణంలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండల పరిధిలోని నక్కపల్లికి చెందిన వడ్డే మల్లేశ్(35) వృత్తిరీత్యా గ్రామంలోనే బుల్డోజర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం చేవెళ్లలో కూరగాయలు తీసుకుని వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై చేవెళ్లకు బయలుదేరాడు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా యూటర్న్ వద్దకు రాగానే చేవెళ్ల నుంచి షాద్‌నగర్ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మల్లేశ్ తలపై నుంచి లారీ టైరు వెళ్లడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మల్లేశ్‌కు భార్య సరిత, ముగ్గురు ఆడపిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐరన్ పరిశ్రమలో పనిచేస్తుండగా కార్మికుడు..

కొత్తూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పారిశ్రామికవాడలోని తీగాపూర్ రోడ్డులో గల రాయలసీమ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ ఐరన్ పరిశ్రమలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో దీపక్‌కుమార్(38) అనే కార్మికుడు మృతిచెందాడని ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు. బిహార్‌కు చెందిన దీపక్‌కుమార్ కొంతకాలంగా పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో పరిశ్రమలో ఉత్పత్తి అయిన ఐరన్ రాడ్లను క్రేన్ ద్వారా డ్రైవర్ సంతోష్‌కుమార్ డంపింగ్ వద్దకు తరలిస్తున్నాడు. అదే సమయంలో హైడ్రా చైన్‌తో అన్‌లోడింగ్ చేసే క్రమంలో ప్రమాదవశత్తూ అక్కడ క్రేన్ గైడ్‌గా ఉన్న దీపక్‌కుమార్ తలపై ఐరన్ రాడ్లు పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు, పరిశ్రమ సిబ్బందికి సమాచారం అందించి.. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. క్రేన్ డ్రైవర్ సంతోష్‌కుమార్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈమేరకు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి బంధువు దరోగ మాంజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపారు.


బొలెరో ఢీకొనడంతో తీవ్రగాయాలై మరొకరు..

నందిగామ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాకలిగుట్టతండా శివారులో బైపాస్ రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొత్తూరు మండలం, సిద్దాపూర్ చింతగట్టుతండాకు చెందిన సభావత్ పాండు నాయక్(42) అదే గ్రామానికి చెందిన సభావత్ రమేశ్ బైక్‌పై శనివారం రాత్రి నందిగామ మండల పరిధిలోని దస్‌సింగ్‌తండాలోని తమ బంధువుల ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చాకలిగుట్టతండా శివారులోని మినార్ హోటల్ వద్ద బైపాస్ రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టింది. దాంతో పాండుకు తీవ్రగాయాలు కావడంతో శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పాండు నాయక్ భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి..

షాద్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. ఆదివారం రాత్రి ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన జాంగారి లక్ష్మయ్య షాద్‌నగర్ పట్టణంలో ఓ మెడికల్ షాపులో మందులు తీసుకున్నాడు. అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు రైల్వేగేటు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి..



ఆదిభట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. టీసీఎస్ సమీపంలో ఉన్న మిలాన్ డ్రైవ్ హోటల్ పక్కన సుమారు 55 సంవత్సరాలు గల వ్యక్తి చనిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని స్థానికులను విచారించారు. కాగా, అతను యాచకుడు అని, టీసీఎస్ పరిసరాల్లో బిక్షాటన చేసేవాడని తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని ఉస్మానియకు తరలించామన్నారు. మృతిడి సమాచారం ఎవరికైనా తెలిసినచో ఆదిభట్ల పోలీసుస్టేషన్ నెంబర్-87126 62671కు సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

చౌదరిగూడ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని పద్మారం గ్రామస్థుడు సాహెబ్‌గారి దామోదర్‌కు చెందిన ఆవు పొలంలో మేత మేస్తుండగా.. కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఆవుకు తగలడంతో అక్కడికక్కడే షాక్ తగిలి చనిపోయింది. ఆవు విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు దామోదర్ కోరాడు.

బాలాజీసింగ్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

ఆమనగల్లు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ తండ్రి రతన్‌సింగ్ ఠాకూర్ మృతి పట్ల పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలు సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆయన నివాసంలో బాలాజీసింగ్‌ను ఆదివారం పరామర్శించారు. రతన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబొద్దీన్, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు బాల్‌రాజ్, కాంగ్రెస్ నాయకుడు తులసీరామ్ నాయక్, తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

చౌదరిగూడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో యూరియా బస్తాలు ఉన్నాయని జిల్లేడు, చౌదరిగూడ వ్యవసాయ శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. నేడు(సోమవారం) మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు 450 యూరియా బస్తాలు అందివ్వనున్నట్లు తెలిపారు. టోకెన్లు పొందిన రైతులు యూరియా బస్తాలను తీసుకెళ్లాలని, మిగతా రైతులకు రెండురోజుల్లో యూరియా అందుబాటులోకి తెస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.